రాప్తాడులో వార్ వన్‌సైడ్!

- ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి విజయావకాశాలు
- వైఎస్సార్‌సీపీ పథకాలు గెలిపిస్తాయని చెబుతున్న విశ్లేషకులు

కనగానపల్లి: రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపు ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో 25,575 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఈసారి మరింత ఎక్కువ మెజారిటీతో గెలుపొందే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఉమ్మడి అసెంబ్లీ నియోజకవర్గంగా రాప్తాడు ఉంది. ప్రస్తుతం ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. వారిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. పోటీలో ఉన్న మిగిలిన అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీఎస్పీలతో పాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీకి రెబల్‌గా దిగిన స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ రాజేష్‌తో టీడీపీ ఓట్లు చీలనున్నాయి.

అభివృద్ధికి బాటలు వేసిన తోపుదుర్తి

గతంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్‌కు దూరంగా అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు పోటీ చేసిన ఈయన రెండు సార్లు ఓడిపోయినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజల పక్షానే పని చేస్తూ వస్తున్నారు. దీంతో 2019లో ప్రకాష్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారు.

రెబల్ అభ్యర్థితో టీడీపీ ఓట్లకు దెబ్బ

రాప్తాడు నియోజకవర్గంలో నుంచి టీడీపీ రెబల్‌గా స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ రాజేష్ పోటీ చేస్తున్నారు. బీసీ వాల్మీకి వర్గానికి చెందిన ఇతడి వల్ల టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత ఓట్లకు భారీగా గండి పడే అవకాశం ఉందని తెలుస్తోంది. వాల్మీకులు ఎక్కువగా ఉన్న రామగిరి, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో అతను ఎక్కువగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ పరిటాల సునీతకు దెబ్బతిస్తున్నారు. దీనికి తోడు ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్ దక్కకుండా చేశారన్న ఉద్దేశంతో వరదాపురం సూరి కూడా పరిటాల సునీత ఓటమికి లోలోపల అతడికి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ఓటర్లకు ఎంత డబ్బు ఎర చూపినా ఈ ఎన్నికల్లో పరిటాల సునీతకు ఓటమి తప్పదని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.



నీటితో పొంగుతున్న పేరూరు డ్యాం (ఫైల్)

నియోజకవర్గంలో ప్రకాష్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు



- గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల లోపల హంద్రీనీవా ద్వారా పేరూరు డ్యాం నింపారు. నియోజకవర్గంలోని 90 శాతం చెరువులు నింపి రైతులకు సాగునీరందించారు.
- లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నియోజక వర్గంలో నాలుగు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం జగన్ ద్వారా పనులు ప్రారంభించారు
- రైతులకు సాగునీటి కల్పన కోసం వైఎస్సార్ జలకళ పథకంతో పాటు నియోజకవర్గంలో తన సొంత నిధులతో ఆరు వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించారు.
- రామగిరిలో బంగారు గనుల పునః ప్రారంభానికి చర్యలు ప్రభుత్వ అనుమతి
- నియోజకవర్గంలోని తాగునీటి కోసం పీఏబీఆర్ కాలువ నుంచి రూ.110 కోట్లతో పైపులైన్ పనులు
- రూ.20 కోట్లతో అమ్మ డైయిరీని ప్రారంభం. 10 వేల మంది మహిళా పాడి రైతులకు డెయిరీ అంకితం
- నియోజక వర్గంలోని 25 వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలతో పాటు 17 వేల మంది పేదలకు ఇళ్ల మంజూరు
- సుమారు 48 వేల మందికి సామాజిక పింఛన్ల పంపిణీ
- ఐదేళ్లలో సుమారు రూ.1,100 కోట్లు పేదలకు పంపిణీ

2019 ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, మెజారిటీ

మండలం	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	మెజారిటీ (పార్టీ)
ఆత్మకూరు	16,771	10,353	6,418 (వైఎస్సార్‌సీపీ)
అనంతపురం రూరల్	32,846	22,526	10,320 (వైఎస్సార్‌సీపీ)
రాప్తాడు	16,670	11,987	4,883 (వైఎస్సార్‌సీపీ)
కనగానపల్లి	14,010	12,777	1,233 (వైఎస్సార్‌సీపీ)
రామగిరి	11,001	13,256	2,255 (టీడీపీ)
చెన్నేకొత్తపల్లి	18,101	13,370	4,731 (వైఎస్సార్‌సీపీ)
పోస్టల్ బ్యాలెట్	1,210	744	466 (వైఎస్సార్‌సీపీ)
మొత్తం	1,11,201	85,626	25,575 (వైఎస్సార్‌సీపీ)

సంక్షేమానికి పట్టం!

- అనంత ప్రజల గాలి అటే మళ్లిందంటున్న విశ్లేషకులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల ఘట్టం తుదిదశకు చేరుకుంది. ప్రస్తుత పరిణామాలు, ఓటర్ల నాడి చూస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమనిపిస్తోంది. నిత్యం ప్రజలకు సేవలందించడంతో పాటు ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. చేదోడుగా నిలిచిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సులువుగా విజయం సాధిస్తారని ప్రజలు చెప్పుకుంటున్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం నియోజకవర్గంలో ఊహకందని సంక్షేమం, అభివృద్ధి జరగడంతో ఈసారి కూడా అనంతకు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారు. మా మద్దతు అనంతకే అని.. ఈసారి కూడా గెలిపించుకుంటామని బహిరంగంగా చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వెళ్తున్న అనంతకు భారీ మెజార్టీ ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రూ.వేల కోట్లతో అభివృద్ధి..

నగరానికి ధీటుగా రూరల్ పంచాయతీల్లో రూ.వంద కోట్లకుపైగా అభివృద్ధి చేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ముఖం చాటేయకుండా ఆస్పత్రులకే వెళ్లి రోగులు, వారి కుటుంబ సభ్యుల్లో ధైర్యం నింపి.. దటీజ్ అనంత అని నిరూపించారు అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అధికారులు, ఉద్యోగులు ప్రశాంతంగా తమ పని చేసుకునే వాతావరణం కల్పించారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ శాఖాల్లో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా సంక్షేమం, అభివృద్ధి వైపే అడుగులు వేయాలని పరితపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూవేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. టవర్‌క్లాక్ ఓవర్ బ్రిడ్జ్, గుత్తి రోడ్డు నుంచి తడకలేరు వరకు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డు, మైనర్ బ్రిడ్జ్‌లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి.

మైనార్టీలకు పెద్దపీట

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మైనార్టీలు అన్ని విధాల అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారు. మేయర్ పీఠం జనరల్‌కు ఉన్నా.. ముస్లిం మైనార్టీలకు కేటాయించేలా చర్యలు తీసుకోవడంలో ఎమ్మెల్యే అనంత కీలక పాత్ర పోషించారు. మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి వక్ఫ్‌బోర్డు చైర్మన్, మార్కెట్‌యార్డు చైర్మన్, కార్పొరేటర్లుగా అవకాశం కల్పించారు. మసీదుల అభివృద్ధికి సహాయం చేశారు.

సూపర్ స్పెషాలిటీకి మోక్షం..

గత టీడీపీ ప్రభుత్వంలోని ఐదేళ్ల పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మోక్షం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. తద్వారా 7 సూపర్ స్పెషాలిటీ సేవల్లో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు సేవలు పొందుతున్నారు.



ఇటీవల నిర్మించిన టవర్‌క్లాక్ బ్రిడ్జ్

కోవిడ్‌లో విశేష సేవలు..

తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనునిత్యం ప్రజల్లో ఉండేవారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సొంతింటి వారే దూరంగా ఉన్నారు. అటువంటి సూపర్ స్పెషాలిటీ, సర్వజనాస్పత్రి తదితర ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోవిడ్ మూడు దశల్లో ఆస్పత్రుల్లో పర్యటించారు. 65 ఏళ్ల వయసులో ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించారు. ఒక్క టీడీపీ నాయకుడు ప్రజలు వైపు చూసిన దాఖలాలు లేవు. గతేడాది వచ్చిన వరదల సమయంలోనూ నగరంలోని నడిమివంకకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనంత పర్యటించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపడమే కాకుండా వారికి సదుపాయాలు కల్పించేలా చూశారు.



దగ్గుపాటిది నేరచరిత్ర

టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి జీవితం నేరచరిత్ర. రాప్తాడు ఎంపీపీగా ఉన్న సమయంలో అతనికి చెందిన వాహనంలో వెళ్లి నిందితుడు శివప్రసాద్ రెడ్డిని హత్య చేశారు. ఆ హత్య కేసులో దుగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నిందితుడు. ఇటీవల అనంతపురం రూరల్‌లోనూ దగ్గుపాటి అనుచరులు వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నం చేసిన సంగతి విదితమే. అనంతపురం సొంత ప్రాంతం కాదు. దగ్గుపాటి నాయకత్వం పట్ల ప్రజలు సైతం ఆసక్తి చూపడం లేదు. టీడీపీ వస్తే మళ్లీ దౌర్జన్యాలు, కబ్జాలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు చెబుతున్నారు.

అధికారులపై దాడులు

టీడీపీ ప్రభుత్వంలో అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్లు చల్లా ఓబులేసు, ఉమామహేశ్వర రావు, సురేంద్రబాబులపై దాడులకు యత్నించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లీశ్వరిని నోటికొచ్చినట్లు తిట్టడంతో ఆమె కన్నీటి పర్యంతమైంది. చివరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం చుట్టూ పెద్ద ధర్నా చేసిన టీడీపీ నాయకులపై ఎటువంటి కేసు నమోదు చేయలేదు. నగరంలోని కమలానగర్‌లో అప్పటి డీఈ కిష్టప్పను పడేసి కొట్టారు. దీనిపై నగరపాలక సంస్థ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా..అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సొంత పార్టీకి చెందిన బీసీ నాయకున్నే కౌన్సిల్‌లో ఎమ్మెల్యే అనుచరుడు చితకబాదాడు. నగరంలో ఓ భయానకమైన వాతావరణాన్ని సృష్టించింది టీడీపీ. 2014 నుంచి 2019లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో ఇటు ప్రజలు.. అటు అధికారులు ప్రత్యక్ష నరకం చూశారు. అప్పటి ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మేయర్ స్వరూపలు వేరుకుంపట్లుగా వ్యవహరించి కేవలం నాలుగు డివైడర్లతో మమ అనిపించారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

రాప్తాడు: మండలంలోని పాలచెర్లకు చెందిన టీడీపీ నాయకులు మంగల హనుమంతు, మంగల రంగమ్మ టీడీపీని వీడి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన గోగుల నాగార్జున, గోగుల లోకేష్, గోగుల మహేంద్ర, మనీల నాగభూషణం టీడీపీకి గుడ్‌బై చెప్పారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రోస్ కేశవ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా వ్యవహరించాలి

తాడిపత్రి అర్బన్: పోలింగ్ సందర్భంగా అప్రమత్తంగా వ్యవహరించాలని అనంతపురం పార్లమెంట్ సెగ్మెంట్ ఎన్నికల పోలీస్ పరిశీలకుడు రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం పోలింగ్ సిబ్బందికి బందోబస్తును నియమించేందుకు సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో డీఎస్పీ గంగయ్య పోలీసు సిబ్బందికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ తతంగాన్ని పోలీస్ పరిశీలకుడు రవికుమార్ పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు వీలుగా బందోబస్తు చేపట్టాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 39 పోలీస్ రూట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎన్నికల్లో పోలీస్ బందోబస్తు

గార్లదిన్నె: మండలంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పోలీస్, పోలింగ్ కేంద్రం బయట ముగ్గురు పోలీసులు, ఐదు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 20 మంది బీఎస్ఎఫ్ జవాన్లు, 6 రూట్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క రూట్‌కు ముగ్గురు స్పెషల్ స్ట్రైకింగ్ పోలీస్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉండేలా దాదాపు వంద మంది పోలీసులతో గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

గార్లదిన్నె మండల వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఆరుగురు చొప్పున 300 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది.

కోటంకలో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఈవీఎంలతో కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- 281 కేంద్రాలకు 562 ఈవీఎంలు సిద్ధం
- ఆయా కేంద్రాలకు చేరుకున్న 4,215 మంది సిబ్బంది

రాప్తాడు/కనగానపల్లి/ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గ పరిధిలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో నాలుగో సారి ఎన్నికలు జరుగుతున్నాయి. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలతో కలిపి మొత్తం 2,50,571 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 281 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఒక్కో కేంద్రానికి ఆరుగురు..

ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్‌తో పాటు నలుగురు సహాయకులు, బీఎల్‌ఓ, వీఆర్‌ఓను నియమించారు. వీరితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, గుర్తింపు పొందిన 4,215 మందిని నియమించారు. వీరితో పాటు సెక్టార్ ఆఫీసర్లు 34 మంది, రూట్ ఆఫీసర్లు 35, బెల్ ఇంజినీర్లు 3 మందిని నియమించారు. వీరందరిని 35 రూట్లలో 76 ఆర్టీసీ బస్సుల్లో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మైదానం నుంచి తరలించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు 562 ఈవీఎంలను సిద్ధం చేశారు. అదే విధంగా ఇద్దరు డీఎస్పీలు, నాలుగురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు, 800 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో పోలింగ్ సామగ్రి కేటాయింపు

281 కేంద్రాల్లో వెబ్ కెమెరాలు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 281 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలను అమర్చారు. అక్కడ జరుగుతున్న పోలింగ్ సరళిని జిల్లా కేంద్రం నుంచే సమీక్షించే అవకాశం ఉంటుంది. వందలాది మంది సిబ్బంది ఎన్నికల విధులకు రావడంతో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది.

ఈవీఎం అభ్యర్థి ఫోటో కూడా..

ఓటర్లు పార్లమెంటు, అసెంబ్లీకి రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రంలో పార్లమెంట్, అసెంబ్లీకి వేర్వేరుగా ఈవీఎంలు ఏర్పాటు చేస్తారు. ఓటరు ఓటు వేసిన తర్వాత ఎవరికి ఓటు వేశామో వీవీ ప్యాట్ ద్వారా పరిశీలించుకునే అవకాశం ఉంది. వీవీ ప్యాట్ ద్వారా 7 సెకన్ల పాటు వేసిన గుర్తును పరిశీలించుకోవచ్చు. గతంలో ఈవీఎంపై పోటీలో ఉన్న అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉండేది. ప్రస్తుత ఎన్నికల్లో ఈవీఎంపై అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు అభ్యర్థి ఫోటో కూడా ఉంటుంది. 13వ తేదీ ఉదయం పీఓలు, ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. మాక్ పోలింగ్ ఏజెంట్లు పరిశీలించాల్సి ఉంటుంది. మాక్ పోలింగ్ అనంతరం సంతకాలు పూర్తయిన తర్వాత ఈ వీఎంలను పోలింగ్‌కు సిద్ధం చేస్తారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లందరికీ నంబర్లతో స్లిప్‌లు అందజేస్తారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత అందరి సమక్షంలో జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలించి అక్కడ పటిష్ట బందోబస్తు మధ్య బద్ర పరుస్తారు.



ఆత్మకూరులో పోలింగ్ సామగ్రి సరిచూసుకుంటున్న సిబ్బంది

సమస్యలు వస్తే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయండి

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పీవోలు, ఏపీవోలు, ఈతర సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వారిగా నియమించి పంపించాం. శాసనసభ, పార్లమెంటు స్థానాలకు రెండు ఈవీఎంలను అందించాం. అదనంగా నోడల్ ఆఫీసర్ల దగ్గర ప్రత్యామ్నాయంగా ఈవీఎంలను సిద్ధంగా ఉంచాం. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ 08554 291001కు తెలియాజేయాలన్నారు.

– వసంత బాబు,
ఎన్నికల రిటర్నింగ్ అధికారి

భక్తిశ్రద్ధలతో ఆరాధన



పూజలందుకున్న జయలక్ష్మీ మాత



అశేషంగా తరలివచ్చిన భక్తులు

రాప్తాడు /అనంతపురం కల్చరల్: దైవాంశస్వరూపురాలిగా పూజలందుకుంటున్న జయలక్ష్మీ మాత జయంతి ఆదివారం కన్నులపండువగా జరిగింది. రాప్తాడు మండల కేంద్రంలోని బొమ్మేపర్తి గ్రామం భక్త జనసంద్రంగా మారింది. ఆశ్రమ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు చిదంబర శాస్త్రి, అమర సింహ నేతృత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చండీ హోమం, పంచామృతాభిషేకం, పంచ హారతులు, అన్నదానం జరిగాయి. స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ట చేసిన వివిధ దేవతామూర్తుల అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈసారి శంకర జయంతి, మాతృదినోత్సవం కలిసి రావడం విశేషమన్నారు. తల్లి ప్రాధాన్యత, క్రమశిక్షణతో కూడిన జీవితం లభ్యమయ్యే తీరు గురించి పురాణేతిహాసాల్లోని ఘట్టాలను వివరించారు. అనంతరం దివ్యనామ సంకీర్తన వీనులవిందుగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాటూ ఆశ్రమ నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి

అనంతపురం కల్చరల్: నగరములోని శంకర మఠాల్లో ఆదివారం శంకర జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష అలంకార సహిత పూజలు, నగరోత్సవాలు, పల్లకీ సేవలు ఘనంగా జరిగాయి. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలోని శంకరమఠంలో జగద్గురువు ఆది శంకరుల జయంత్యుత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో నగర వీధుల్లో జగద్గురువుల ఉత్సవ విగ్రహాలను భక్తజన సంకీర్తనల నడుమ ఊరేగించారు. మధ్యాహ్నం నారాయణ సేవ (అన్న సంతర్పణ) కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశీకులు రామసుబ్రహ్మణ్యం , ఉపనయన సేవా సమితి నిర్వాహకులు సాయి శివరాం, రఘు, రాఘవేంద్ర జోషి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగర శివారులోని శృంగేరి శారదా శంకర మఠంలో శంకర జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివస్వరూపులైన శంకరాచార్యులు, శారదామాతను సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఇన్‌చార్జి మేనేజర్ సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయ పరిసరాలలో అమ్మవారిని ఊరేగించారు. తపోవనంలోని వేదమాత గాయత్రి దేవి ఆలయంలో శంకర జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. స్వామికి రుద్రాభిషేకాలు, శతనామార్చన, తీర్థప్రసాద వినియోగం ఘనంగా జరిగాయి.



శంకరమఠంలో పూజలందుకున్న ఆదిశంకరుడు